క్లుప్తంగా

వీఆర్‌ఏ సంఘం జిల్లా కార్యదర్శిగా కొప్పర్తి గిరిబాబు



దెందులూరు: వీఆర్ఏల సంఘం ఉమ్మడి గోదావరి జిల్లాల కార్యదర్శిగా మండలంలోని దోసపాడు వీఆర్‌ఏ కొప్పర్తి గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా, రాష్ట్ర నాయకుల సమక్షంలో జరిగిన సమావేశంలో గిరిబాబును జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఏ సంఘం అభివృద్ధి, బలోపేతానికి కృషి చేస్తూ వీఆర్ఏలకు తోడ్పాటుగా ఉండాలని జిల్లా రాష్ట్ర నాయకులు సూచించారు.

జాతీయ విద్యావిధానంతోనే విద్యార్థుల భవిష్యత్తు

దెందులూరు: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. నాగేంద్ర కుమార్ అన్నారు. గురువారం గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ఎస్ చంద్రశేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ భారతదేశ విద్యావిధానంలో అనేక మార్పులు, జాతీయ విద్యావిధానం 2020లో తీసుకువచ్చారన్నారు. త్రిభాష సూత్రం ప్రకారం విద్యార్థులందరూ తమ పాఠశాలల్లో మూడు భాషలు నేర్చుకోవాలని పాలసీ సిఫార్సు చేసినట్లు వివరించారు. మూడు భాషాల్లో కనీసం రెండు భారతీయ భాషలుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్, సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ సాయికుమారి, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రతినిధి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

భీమడోలు : చెత్త నుంచి సంపద ద్వారా పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయని ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, మంచినీటి చెర్వులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించేందుకు గురువారం ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు ఏలూరు జిల్లా నుంచి భీమడోలును జాతీయ స్థాయిలో నామినేట్ చేయడం జరిగిందని, ఇక్కడ పారిశుధ్యం, పరిశుభ్రత పనుల నిర్వహణ తీరును డీపీవో ఆయనకు వివరించారు. చిత్తశుద్ధితో పనిచేస్తే అవార్డు సొంతమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ శిరీషా, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఈవోఆర్‌డీ ముత్తయ్య, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు ఆసుపత్రిని పరిశీలించిన కేంద్ర కమిటీ

ఉంగుటూరు : జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు డా. ఎంజీ శివ దాస్, డా. ఆనంది సత్యకుమార్ గురువారం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఆరోగ్యకేంద్రం ఆసుపత్రి వైద్యులు డా.సుబ్బరాజు వర్మ, డా. శ్రావణరెడ్డి కమిటీ సభ్యులకు సహకరించారు.

సొసైటీలో లెక్కలంతా పక్కా..

పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ వెల్లడి

పెదవేగి : పెదవేగిలోని ప్రాథమిక సహకార సంఘం(సొసైటీ)లో చనిపోయిన వారి పేరున నిధులు స్వాహా చేశారని పెదవేగికి చెందిన తిప్పాభట్ల సత్యనారాయణ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని ఈ విషయం విచారణలోనూ తేలిందని పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు తెలిపారు. పెదవేగి సొసైటీలో తన తండ్రి శ్రీరామచంద్రమూర్తి(పెదరాముడు) మృతి చెందిన తరువాత కూడా తనతండ్రి పేరుతో నిధులు మూడేళ్ల పాటు తీసుకున్నారని మృతుని కుమారుడు తిప్పాభట్ల సత్యనారాయణ ఈనెలలో రెండు సార్లు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించారు. దీనిపై సొసైటీ ఛైర్మన్ పీవీ.సుబ్బారావు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తప్పులన్నీ అతని వద్ద పెట్టుకుని కావాలని సొసైటీ పరపతిపై బురద జల్లే కార్యక్రమం చేపట్టాడని, ఈ విషయంలో తిప్పాభట్ల సత్యనారాయణ చేసిన లావాదేవీలపై విచారణ చేయించి, సొసైటీ ప్రతిష్ఠకు భంగం కల్గించడంతో పాటు అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించిన తిప్పాభట్ల సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని సుబ్బారావు, కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. సొసైటీ పాలకవర్గ సభ్యుడు మేకా వసంతరావు, సొసైటీ ఈవో మూర్తి పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే

దెందులూరు: భారత ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు సమగ్ర సర్వే దెందులూరు మండలంలో వేగవంతంగా జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) శేఖర్ తెలిపారు. గురువారం పోతునూరు, దోసపాడు, కొవ్వలి గ్రామాల్లో చేస్తున్న ఇంటింటా సర్వేను ఆయన పరిశీలించారు.

వర్షాలతో మునిగిన పంటలు

ఉంగుటూరు : గత కొన్ని రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా పంటచేలు నీట మునిగాయి. మండలంలో 1500 ఎకరాల వరకు నీట మునిగిపోయాయి. ఒకటి రెండురోజుల్లో నీరు లాగితే సరి లేకపోతే మూనలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 14వతేదీ నుంచి ఇప్పటివరకు రోజూ వర్షం కురుస్తూనే ఉంది. అయితే మెదటి దశలో కురిసిన వర్షాలు రైతులకు ఉపయోగపడ్డాయి. నాట్లు వేగవంతం అయ్యేందుకు దోహదపడ్డాయి. ఆ తరువాత నుంచి గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట చేలు మునిగే పరిస్థితి ఉత్పన్నమయ్యింది. మంగళవారం 17.2 మిల్లీమీటర్ల వర్షం కురియగా బుధవారం 37.29మి.మీ., గురువారం 32 మి.మీ. వర్షం కురిసింది. కైకరం ఆయకట్టులో సుమారు 35 ఎకరాలు నీట మునిగిపోయాయి. ఈనీరు సముద్రాన్ని తలిపించేలా కనిపిస్తోంది. నాచుగుంట ఆయకట్లలో 15 ఎకరాలు, ఉంగుటూరు ఆయకట్లలో 6 ఎకరాలు, బొమ్మిడిలో 20 ఎకరాలు, రావులపర్రులో 30 ఎకరాలు, వెల్లమిల్లిలో 15 ఎకరాలు, బాదంపూడిలో 10 ఎకరాలు నీటమునిగాయి. లంకమాలపల్లి, కైకరం పాతదళితవాడ, కాళింగులపేట, నారాయణపురం వైఎస్సాఆర్ కాలనీ, కళాశాల ప్రాంతం, నాచుగుంట పంచాయతీలో కొన్ని ఇళ్ల చుట్టూ నీరు చేరింది. ఏవో బాలిన వెంకటేష్ కైకరం ఆయకట్టు, ఎంపీడీవో ఆంజనేయులు కాకర్లమూడి ఆయకట్టు ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటరమణ మండల కార్యాలయం నుంచి వీఆర్వోల ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

చెరువులకు నిండానీరు

మెట్టప్రాంత గ్రామాలలో విస్తరించి ఉన్న మైనర్ ఇరిగేషన్ చెరువులకు పూర్తిస్థాయిలో వర్షం నీరు చేరింది. కొన్ని చెరువులు గట్లను తాకుతూ ఉన్నాయి. మెట్టప్రాంతంలో నాచుగుంట, వెల్లమిల్లి, ఉంగుటూరు, నీలాద్రిపురం, గోపినాథపట్నం, గొల్లగూడెం, గోపాలపురం, నల్లమిదు, యర్రమిల్లిపాడు, గోకవరం, తిమ్మయ్యపాలెం గ్రామాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండిపోయాయి. కొన్ని చెరువులు పొలిడ్యామ్‌లు ద్వారా నీరు బయటకు ప్రవహిస్తున్నాయి. అలాగే పోలవరం కాలువకు నీరుచేరింది. ఏలూరు ప్రధాన కాలువతో పాటు మండలంలో మేజరు డ్రెయిన్లు తోకలపల్లి కోడు, పందికోడుకు నీరు బాగాచేరింది. మీడియం డ్రెయిన్లు కాకర్లమూడి, మిడ్ లెవెల్ ఛానల్ పత్తేపురం పంటకాలువ, రాచకోడు, తదితర మైనర్ డ్రెయిన్లు కూడా నిండా ప్రవహిస్తున్నాయి.

ఎగువ వరద నీరంతా... కిందకు

భీమడోలు : కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో వాగులు, వంకలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ వరద నీరంతా దిగువ ప్రాంతాలకు చేరడంతో గురువారం మండలంలోని వరి క్షేత్రాల్లోని వరి నాట్లు ముంపుబారిన పడ్డాయి. భీమడోలు, పూళ్ల, గుండుగొలను, వడ్డిగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లోని సుమారు 450 ఎకరాల్లోని వరి నాట్లు ముంపుబారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. అక్వా చెర్వుల వల్ల పక్కనే ఉన్న డ్రెయిన్లు పూడుకుపోవడంతో ముంపు నీరంతా పొలాల్లో తాండవిస్తున్నాయి. మంపునకు గురైన వరి చేనులను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఏవో ఉషారాణి, ఉపాధిహామీ ఏపీవో సుధాకర్, డెప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్ ఆ చేనులను పరిశీలించారు. గుండుగొలనులోని నాగులకోడు, లక్ష్మీపురం శివారులోని బొబ్బిలిలంక డ్రెయిన్లను అక్వా రైతులే పూడ్చివేసారని రైతులు అధికారులు వద్ద తమ గోడును విన్నవించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఆ డ్రెయిన్ల పూడిక తీయిస్తామని రెవెన్యూ అధికారులు వారికి హామీ ఇచ్చారు.



ఉంగుటూరు : కైకరం ఆయకట్టులో పంటచేలు మునిగి సముద్రంలా కనిపిస్తున్న దృశ్యం



ఉంగుటూరు : వర్షాలకు బాదంపూడి ఆయకట్టులో నీటమునిగిన పంట చేలు



భీమడోలు : మునిగిన వరి నాట్లను ఏవో ఉషారాణికి చూపుతున్న రైతు

ట్రైనీ కలెక్టర్, డీపీవోలు ముంపు పొలాల పరిశీలన



లక్ష్మీపురంలో అక్రమణలను పరిశీలిస్తున్న డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్

భీమడోలు :ఆగడాలలంక ఛానల్ రోడ్డు వెంబడి వడ్డిగూడెం, లక్ష్మీపురం మధ్య ఉన్న గల వరి నాట్లు ముంపునకు గురైన ప్రాంతాన్ని గురువారం ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ పరిశీలించారు. అక్వా చెర్వుల యజమానులు అక్రమించుకుని రోడ్డు వేయడం, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు పూడిక తీయించకపోవడం వల్లే మా వరి నాట్లు ముంపున పడ్డాయని రైతులు ఉన్నతాధికారులకు తెలిపారు. పొలాల్లోని మంపు నీరు బయటకు పోయేలా తగు చర్యలు తీసుకోవాలని వారు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ముత్తయ్య, గ్రామ కార్యదర్శి మురళీ, వీఆర్వోలు గోవింద్, వినయ్ కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమంపై సమీక్ష



పీడీలతో సమీక్షిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

భీమడోలు : ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడమే ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమ లక్ష్యమని ఎంఈవో ఇ.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలో అక్టోబర్ 2వ తేదీ నుంచి ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున సంబంధిత ఉన్నత పాఠశాలల పీడీలతో గురువారం స్థానిక ఎంఆర్సీలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ వి.వెంకటేశ్వరరావు పోటీలు నిర్వహించాల్సిన విధానాన్ని ఎంఈవోకు వివరించారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖోలతో పాటు పలు అంశాల్లో గ్రామ సచివాలయ, మండల స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీల నిర్వహణకు వివిధ ప్రభుత్వ పాఠశాల్లోని ఆట స్థలాల పరిస్థితిపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షించగా ఎంఎంపురంలో ఆట స్థలం లేదని, కురెళ్లగూడెంలో పీఈటీతో పాటు ఆటస్థలం కూడా లేదని తమ దృష్టికి వచ్చిందని ఎంఈవో తెలిపారు. విద్యార్థులు సైతం ఆటలు ఆడేందుకు ఇతర ప్రాంతాలకు రావాల్సి ఉంటుందని, దీనిలో భాగంగా వారికి సమీపంలోని గుండుగొలను, భీమడోలు, పూళ్ల, ఆగడాలలంక ఉన్నత పాఠశాలలు, పోలసానిపల్లి గురుకుల పాఠశాలల్లో గల ఆట స్థలాలను వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. క్రీడా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమపాధ్యాయులు శేఖర్, ప్రసాద్, విజయలక్ష్మీ, సాయిలక్ష్మీలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



తోకలపల్లిలో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. గురువారం తోకలపల్లి గ్రామంలో రూ.20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) నిధులతో నిర్మించిన సీసీ రహదారిని, జలజీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మంచినీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.50 కోట్లతో పత్తేపురం నుంచి తోకపల్లి మీదుగా భీమడోలు మండలం సాయింపాలెం వరకూ ఆర్‌అండ్‌బీ రహదారి మంజూరైందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్‌లు గణసల కృష్ణకుమారి, వంజరపు సత్యనారాయణ, ఓగిరాల ప్రభాకరరావు, ఎంపీటీసీ మద్రిపూడి రత్నకుమారి, గ్రామపార్టీ అధ్యక్షులు బలే నల్లకొండలు, ఓగిరాల దావీదు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి మంత్రబుద్ధి చిన అప్పారావు, సచివాలయ కన్వీనర్ బలే చినబాబు, పార్టీ నేతలు గండి రాజు, వంజరపు నాగసత్యనారాయణ, బలే ఎర్రకొండలు, బయ్యే విజయ్ తదితరులున్నారు.


ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు



కొవ్వలిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ, ఇరిగేషన్ ఎస్ఈ

దెందులూరు: కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో ముంపుకు గురైన వరి పొలాల సమస్యలను ఉపాధి నిధులతో పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉపాధి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము అన్నారు. గురువారం మండలంలోని కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో ముంపుకు గురైన వరి పొలాలను జిల్లా, మండలాధికారులు పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీరు అధికంగా ఉన్నందున మనుషులతో ముంపు సమస్య పరిష్కారం జరగదని, ఖచ్చితంగా యంత్రాలతో చేయించాలని రైతులు సూచించారు. ముంపు నీరు అధికంగా ఉన్న పొలాల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనల మేరకు ఉపాధినిధులతో పనులు చేయిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఏఈ గద్దె రమేష్, ఏఈ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, ఏపీఓ దశరథ రామ్‌జీ, తదితరులున్నారు.

తుపాను సేవా కార్యక్రమాల్లో మహిళా సర్పంచులు



ముంపునకు గురైన ప్రాంతంలో జేసీబీతో మట్టిని వేయిస్తున్న సర్పంచ్ కే.నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: గత ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. మేధినరావుపాలెం గ్రామంలో ఉన్నత పాఠశాల పక్కన కారుపై చెట్టు పడింది. సమాచారం అందుకున్న సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి కొంత మందిని ఏర్పాటు చేసి కారుపై పడిన చెట్టు కొమ్మలను నరికించి అనంతరం చెట్టు భాగాన్ని కారుపై నుంచి తొలగించారు. మహిళా సర్పంచ్ అయి ఉండి సంఘటా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొనడంపై గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. గోపన్నపాలెంలో ప్రభుత్వ వ్యాయామ కళాశాల ముందు భాగం ముంపుకు గురైంది. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ జేసీబీని ఏర్పాటు చేయించి మట్టి వేయించి ముంపుకు గురైన ప్రాంతంలో చదును చేయించారు. వందలాది మంది వ్యాయామ విద్య శిక్షణ పొందుతున్న కళాశాలలో వర్షంలో సైతం సహాయక చర్యలు చేపట్టడంపై సర్పంచ్‌ను 400 మంది వ్యాయామ విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు. వారి వెంట ఎంపీటీసీ ఏనుగు అంజలి ప్రసాద్ ఉన్నారు.

రైతులు సాంకేతిక పద్ధతులు అవలంబించాలి



రైతులతో కలిసి పొలాలను సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

గణపవరం : రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని, వ్యవసాయ నిపుణుల సలహాలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. గురువారం గణపవరం మండలం అప్పనపేట గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందుల వినియోగం అవసరం మేరకు ఉండాలని, అతిగా వాడటంవల్ల తెగుళ్లు అదుపులోకి రావన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు మోతాదుకు మించి వాడరాదన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈసందర్భంగా వారు రైతులతో కలసి వరిపొలాలను పరిశీలించారు. వరిపై ఆశించే తెగుళ్లు, నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, సర్పంచ్ నక్కా సూరిబంగారయ్య, ఎంపీటీసీ కొల్లి సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నూరుశాతం పథకాలు

పెదవేగి : అర్హులందరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపుల్లో అర్హులకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తారని, కుల, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు ఆదాయ ధ్రువీకరణ, డేట్ ఆఫ్ బర్త్, మరణ ధ్రువీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ), కొత్త రేషన్ కార్డు, రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్ల తొలగింపు వంటి 11 సర్వీసులకు గాను 629 ధ్రువపత్రాలు ఈ క్యాంపులలో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ, మాజీ ఏఎంసీ చైర్మన్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, ముందూరు సొసైటీ చైర్మన్ చెరుకూరి ప్రసాద్, నాయకులు గుత్తా ప్రసాద్, బొద్దు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగోకవరంలో...

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం తాళ్లగోకవరం గ్రామంలో అర్హులకు ధ్రువపత్రాలను అందించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా అర్హులకు ధ్రువపత్రాలు అర్హులకు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న లేఅవుట్, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, ట్రిగార్డ్స్ ఏర్పాటు చేశారు. వలంటీర్‌లు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇతర నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

నూరుశాతం సమస్యల పరిష్కారానికే..

నిడమర్రు : లబ్ధిదారుల సమస్యల్లో నూరుశాతం పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. గురువారం తోకలపల్లి గ్రామంలోని సామాజిక భవనం వద్ద జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసమే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. వీటికి కొనసాగింపుగా రాష్ట్రంలో మిగిలిన 1శాతం మంది ప్రజల్లో కూడా ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే వారికి పథకాలు అందించడంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్షలో అధికారులే స్వయంగా మీ గ్రామం వచ్చి అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన జంటకు వివాహ ధ్రువీకరణ పత్రాన్ని, తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాలకు చెందిన ఆరుగురికి కొత్తగా రేషన్ కార్డులు, 84 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తదితరులున్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

పెదపాడు: గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. లక్షల కోట్ల రూపాయలను పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు కొనియాడారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 11రకాలు ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు వివరించారు. రూ.5కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు రేషన్ సరుకులు కూడా ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ కుల, మత, వర్గ బేధం లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గా ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారిలు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్థానిక సర్పంచ్ వట్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, ఎంపీటీసీ కంభాల నాగరాజు, స్థానిక నాయకులు బత్తుల ఏసురాజు, ఏఎంసీ డైరక్టరు బోదవరపు వెంకటేశ్వరరెడ్డి, వట్రపు గోవిందరెడ్డి, రావులపాటి బోస్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గూడవల్లి కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పాల్గొన్నారు.



నిడమర్రు : తోకలపల్లిలో నూతన జంటకు వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే



పెదపాడు : లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



పెదవేగి : తాళ్లగోకవరంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

అబ్దుల్ కలాం సేవలకు సలామ్



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

భీమడోలు : మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరవలేనివని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం భీమడోలు సంత మార్కెట్‌లోని అబ్దుల్ కలాం, డాగూరే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అతి సాధారణ స్థాయి నుంచి దేశ ప్రథమ పౌరుడిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని, ఆయన ఆశయ సాధనకు యువత పాటుపడాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు, సంఘం అధ్యక్షుడు డి.శ్రీరామ్, ప్రతినిధులు, ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు: అబ్దుల్ కలామ్ అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ అన్నారు. గురువారం ఉప్పాకపాడు ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలామ్ వర్ధంతి నిర్వహించారు. ఉపాధ్యాయుడు అల్లు శ్రీను అబ్దుల్‌కలామ్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయరాలు శ్రీదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

దెందులూరు: భారతరత్న, దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా ఉన్నత స్థితిని పొందాలని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఎస్ఎస్‌వీజీ శర్మ అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

మణిపూర్ ఘటనపై నిరసన

పెదవేగి : మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం, హత్యలను వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ లీగల్‌సెల్ సీనియర్ న్యాయవాది బైగాని రంగారావు ఖండించారు. దీనికి సంపూర్ణ బాధ్యులైన వారిపై త్వరగా విచారణ జరిపి బహిరంగా ఉరిశిక్ష అమలు చేయాలని, దీనికి సహకరించిన ప్రభుత్వ యంత్రాంగంపై కూడా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

29న దెందులూరులో శంకుస్థాపనలు

దెందులూరు: దెందులూరు గ్రామంలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు పెదదళితవాడలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంజూరు చేసిన నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. గురువారం రాత్రి దెందులూరులో ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథులు గా వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత విచ్చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు, వలంటీర్లు, గృహసారథులు శంకుస్థాపన కార్యక్రమానికి పాల్గొనాలని కోరారు.